# గలగలా గోదారి

-భైరవయ్య

కాంతం బిక్కు బిక్కుమంటూ, పసిగుడ్డుని పక్కలో వేసుకుని పడుకునుంది. గువ్వదీపం గదిలో ఓ మూల కూచుని ధైర్యం చెబుతోంది. మండువా కన్నంలోంచి గుడ్డి వెన్నెల పల్చగా జారి గది గుమ్మం దగ్గర తారట్లాడుతోంది. ఇంట్లో పిట్టలేదు. ఇంటి బయట చిటుక్కుమన్న శబ్దం లేదు. గది గుమ్మం దగ్గర తారట్లాడే గుడ్డి వెన్నెల, గువ్వదీపం వున్నంత పరుచుకున్న లేత వెలుగులు తప్ప, ఇల్లంతా చీకటిగా వుంది. చీకటి అంత భయం కలిగించగలదని, నిశ్శబ్దం అంత కర్ణకఠోరంగా వుండ గలదని అప్పటివరకు కాంతానికి తెలియదురా అబ్బాయ్.

పక్కలో పసిగుడ్డుని పొదువుకుని, చేతి ముణుకు మీద తల పెట్టుకుని, "గంటాలమ్మ తల్లీ నువ్వే దిక్కు" అనుకుంటూ నులక మంచం మీద పడుకునుంది కాంతం.



అది మండువాలోగిల్లా అబ్బాయ్. మండువాలోగిలంటే కనీసం ఏడెనిమిది గదులుండే పెంకుటిల్లు. ఆ యింటికి పెద్ద పెద్ద అరుగులు. ఆ అరుగులు దాటి లోపలికి ప్రవేశించగానే పెద్ద హాలు వుంటుంది. ఆ హాల్లోకి పై కప్పులో వున్న ఖాళీలోంచి వెలుతురు పడుతుంది. ఇంటిలో ఎక్కువ భాగం ఆ హాలుకే కేటాయిస్తారు. అంత పెద్ద యింటికి పెంకు పరవాలంటే గర్భం చాలా పెద్దది లేపాల్లా అబ్బాయ్. అందుకని, పై కప్పుని ఇంటి బయటికి లోపలికి సోపులు దించి పెంకు పరుస్తారు. లోపలి వైపుకు దించిన సోపులోంచి వాననీరు యింట్లోకి ప్రవేశిస్తుంది కదా. అందుకని, ఆ నీరు పోవడం కోసమని మధ్యలో ఖాళీవదలి,నేల లో నలుచదరంగా గొయ్యి తవ్వి, నీరు బయటికి పోవడానికి తూము పెడతారు. కప్పు తక్కువ ఎత్తులో వుండటం వల్ల, వెలుతురు తగ్గడం సహజం కదరా. కప్పులో ఆ ఖాళీ వుండటం వల్ల వెలుతురు యింట్లోకి ప్రవేశించ డానికి అవకాశముంటుందన్నమాట. అటువంటి యిళ్ళు బ్బాయ్, కాస్త కలిగిన వాళ్ళే కట్టుకునేవారు. వారివారి ఆర్థిక స్తోమతని బట్టి, హోదాని బట్టి మండువాల సంఖ్య పెరిగేదిలే.

అదిగో అటువంటి, ఒంటిమండువా యింట్లో, ఒక్కర్తీ బిక్కుబిక్కుమంటూ పడుకునుంది కాంతం. పైగా బాలింతరాలు. పక్కలో పసిగుడ్డుకి నెలన్నానిండ లేదు.

ఆ వూరు శుద్ధ పల్లెటూరు కాకపోయినా, తాలూకా కేంద్రమయినా, నేటి ప్రమాణం దృష్ట్యా అది పల్లెటూరే. కొంచెం పెద్ద పల్లెటూరనుకో. ముఖ్యమైన వీధులన్నీ కంకరతో వేసినవే. అప్పటికింకా బయస్కోపులు కొత్త. సకృత్తుగా సంవత్సరానికో సారి టూరింగ్ టాకీసు వచ్చేది. అందుకని, ఆ రోజుల్లో నాటకాలు, యక్షగానాలు, కూచిపూడి భాగవత కలాపాలే కాలక్షేపం జనాలకి. అవి వచ్చినప్పుడు జనం విరగబడేవారు. ఆ కార్యక్రమాలన్నీ కూడా రాత్రి తొమ్మిదింటికి ప్రారంభమయి ముక్కపొడి చేవరకు కొనసాగేవి. వేషం కట్టే వాళ్ళకి చూసేవాళ్ళకి కూడా సరదా. పంతం రెండూ వుండేవిరా. సరసత్వమూ వుండేది. ఆ రోజులు వేరులే.

విషయమేమిటంటే, ఆ రాత్రి మీసాల కృష్టుడి 'పాండవోద్యోగ విజయాలు' నాటకం. అతని పేరు నువ్వు విన్నావో లేదో.

"గొల్లభామలతో తిరిగినప్పుడే మోకాని, రాజకీయాల్లోకి దిగిన తర్వాత, కృష్ణుడు పేడిమూతితో వుండడమన్నది అసంభవం" అని ఢంకా బజాయించి మరీ చెప్పి, సొంతమీసాల తోటే కృష్టుడివేషం వేసి, అనేకసార్లు 'వన్సుమోర్లు' కొట్టించుకుని, ఆ తిరుపతి వెంకటకవుల చేతే సెభాష్ అనిపించుకున్న ఘనుడ్రా మీసాల కృష్ణుడంటే.

ఆ మీసాల కృష్ణుడి నాటకమనే సరికి వూరంతటి తో పాటు యింటిల్లిపాదీ కూడా సిద్ధమయ్యారు. కాంతం బాలింతరాలవడంతో కదలడానికి కుదరలేదు.

"ఎవళ్ళైనా సాయంవుండండ్రా" అంది కాంతం.

## సబలాం ప్రపద్యే

"భయవేమిటే, దీపం పెట్టుకుని, తలుపేసుకుని పడుకో. ఎంతసేపు" అన్నారందరూ.

"సోద్యవో వదినా. మగాడికి మొగుడిలాంటి మగరాయుడివి. నీకు భయవేమిటే. పెళ్ళిలో మాళ్ళేదూ మా తమ్ముడి పాట్లూ" అంటూ అత్తగారు చూడకుండా కాంతాన్ని వేళా కోళమాడారు, వదినలు.

మొత్తమ్మీద బ్బాయ్, కాంతాన్ని అంతయింట్లోను వదిలేసి వెళిపోయారందరూ.

ఇంటి వెనక విశాలమైన పెరడు. చుట్టు పక్కల యిళ్ళలో కూడా అలికిడిలేదు. "అందరూ కట్టకట్టుకుని ఆ నాటకానికే తగలడి నట్టున్నారు" అనుకుంది కాంతం.

వీధి తలుపు, ఎరటి తలుపులన్నీ గట్టిగా బిగించేసిందిరా కాంతం. మండువాని ఆనుకుని వున్న గదిలో పడుకునుంది. పక్కలో పసిగుడ్డు నిద్దరోతూనే పాలు తాగుతున్నాడు. కాంతానికి కళ్ళు మూతలుపడుతున్నాయి. నిద్రపోతే ఏమవుతుందో అనే భయం. దానికి తోడు ప్రాణాంతకమైన నిశ్శబ్దం. చీమలు నడుస్తున్న చప్పుడు కూడా వినిపించేటంత నిశ్శబ్దం. రోడ్డు మీద కుక్కలు కూడా నిశ్శబ్దంగానే వున్నాయి.

శివరాత్రెళిపోయిందేమో ఉక్క పోత ప్రారంభమయింది. చికాగ్గాకూడ వుంది కాంతానికి.

మీసాల కృష్టుడ్ని, నాటక సమాజం వాళ్ళని, యింట్లో వాళ్ళని, వూళ్ళోవాళ్ళని అందర్నీ తిట్టుకుందిరా కాంతం. కడుపునిండినట్టుంది. పక్కలో పిల్లాడు కూడా హాయిగా నిద్దరోతున్నాడు.

"ఈ గాడిద మూలానే కదా ఒక్కర్తినీ వుండిపోవలసి వచ్చింది," అని వాణ్ణి తిట్టుకుంది.

కాంతం అలా చికాకు పడుతున్న సమయంలో నబ్బాయ్, పెంకు జారిన శబ్దమయిందిరా. ఆ శబ్దం

కాంతం చెవులకి భేరీ నాదంలా వినిపించింది. కదల కుండా వుండిపోయింది. కొంతసేపటికి పెంకుల మీద మెత్తగా పడుతున్న పాదాల సవ్వడి.

గాలి కూడా కదలనంత నిశ్శబ్దంగా లేచిందిరా అబ్బాయ్ కాంతం. పసిగుడ్డుని చీరతో నడుముకి బిగించి కట్టిందిరా.. ధైర్యం కోసం పక్కనే పెట్టుకున్న రోకటిబండని చేత బట్టి తలుపు వెనక్కి చేరి చూస్తోంది రా.

పెంకుల మీద నాలుగుపాదాలు కదులుతున్న చప్పుడు. ఆ పాదాలు ఎంత మెత్తగా నడుస్తున్నా, నిశ్శబ్దానికి అలవాటుపడిన కాంతం చెవులు, ఆ పాదాల ప్రతి కదలికని స్పష్టంగా వింటున్నాయి.

మండువాలోంచి లోపలికి జారుతున్న చిరువెన్నెల క్షణంసేపు మాయమయిందిరా. మరుక్షణమే నేలమీద మెత్తటి చప్పుడు. కాంతం చేతులు రోకలి మీద గట్టిగా బిగుసుకున్నాయి.

మండువాలోంచి కిందికి దూకిన శాల్తీకి, గువ్వదీపం వెలుగు కనిపించింది. చప్పుడు చెయ్యకుండా ఆ శాల్తీ గదిగుమ్మం దగ్గర కొచ్చి తొంగి చూసింది. ఎవరూ కనిపించలేదు. వినపడీ వినపడనట్టు తలుపు మీద తట్టి చూసింది. ఏమీ అలికిడి లేదు. ఓరగా వేసున్న తలుపుని దాటి తల లోపలికి పెట్టింది.

తలుపు సందులోంచి సదరు శాల్తీ చర్యలన్నీ గమనిస్తోందిరా అబ్బాయ్ కాంతం. ఒక శాల్తీయే లోపలికి దిగిందనీ, రెండో శాల్తీ కప్పమీదే వుందని తెలుసుకుంది.

దిగిన శాల్తీ తాలూకు తల, తలుపుదాటి లోపలికి




రాగానే, "జై గంటాలమ్మ తల్లీ" అని చేత నున్న రోకలితో ఒకటే పెట్టు పెట్టిందిరా.

"చచ్చాన్రోయ్" అన్నగావు కేక సదరు శాల్తీనోట్లోంచి వచ్చింది. ఆ కేక రావడవేమిటి, కప్పమీదున్న శాల్తీ రెండంగల్లో కప్పదాటి ఎగిరిపోయింది.

దీపం పెద్దది చేసి, కింద పడ్డ శాల్తీని చూసిందిరా కాంతం. ఈ హడావుడికి లేచిన పసిగుడ్డు ఏడుపుని పట్టించుకోలేదు.

తొడలదాకా బిగకట్టిన పంచెతో, నల్లటి ఒంటి మీద విగవిగలాడుతున్న మూవెతో స్పృహ తప్పి పడి పోయిన దొంగని చూసింది. గుండె చిక్క బట్టుకుని, వంటింట్లోకి వెళ్ళి, రుబ్బురోల్ని ఎలాగోదొర్లించుకొచ్చి, చలనంలేని వాడివీపు మీదకి అతికష్టం మీద చేర్చి, ఆ రుబ్బు రోలు మీద తనెక్కికూర్చుందిరా; క్షణాల్ని లెక్కబెడుతూ, గంటాలమ్మని తలుచుకుంటూ.

నాటకం నుంచి తిరిగొచ్చిన జనానికి, తలుపు తీసిన కాంతం అమ్మ శక్తిలా కనిపించింది. గది గుమ్మానికి అడ్డంగా సగంబయటా, సగం లోపలా పడున్న దొంగ శరీరం, వాడివీపుమీద కొండని బోర్లించినట్టున్న రుబ్బురోలు దర్శన మిచ్చాయి.

"ఏవయిందే తల్లీ" అని గుండెలు గోక్కుంటూ కాంతం తల్లి అడిగింది కాంతాన్ని పట్టుకుని.

అంతవరకూ వుగ్గబట్టుకుని వున్న కాంతం, తల్లిని పట్టుకుని వెక్కివెక్కి ఏడ్చిందిరా.

ఆ తల్లీ, యింటిల్లిపాదీ తూర్పారబట్టింది; నాటకానికి వెళ్ళినవాళ్ళతో పాటు తనూ వున్నా నన్న సంగతి మర్చిపోయి.

మగ జనం అందరూ, ఆ దొంగ వీపు మీంచి రుబ్బురోలు తీసి, కొన వూపిరితో వున్న వాడికి శైత్యోపచారాలు చేసి ఠాణాలో అప్పగించారు.

ఈ సంగతి, వూరంతటికీ, కలెక్టు దొరగారికి మర్నాటి వుదయానికల్లా తెలిసి పోయిందిరా. కాంతాన్ని చూడటం కోసం వూరంతా విరగబడింది. దొరగారు కాంతానికి బహుమానం కూడా ఇచ్చారులే. అది వేరే సంగతి.



CHAITRA-B G 342 TEL